క్లుప్తంగా

కూల్చివేస్తే.. కాల్చుకుంటాం



బేస్‌మెంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: చెరువు శిఖం భూమిలో నిర్మిస్తున్న కట్టడాన్ని తొలగించేందుకు వెళ్లిన నీటి పారుదల శాఖ అధికారులకు కబ్జాలో ఉన్న కుటుంబ సభ్యుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. జల్‌పల్లి మున్సిపాలిటీలోని తాళ్లకుంట చెరువు వద్ద బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తాళ్లకుంట శిఖం భూమి(119 సర్వే నంబర్)లో ఓ కుటుంబం 100 గజాల విస్తీర్ణంలో బేస్‌మెంట్ నిర్మాణం చేపట్టింది. దీనిపై గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు శశికళ, జనార్దన్‌లు మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి కూల్చి వేసేందుకు అక్కడికి చేరుకున్నారు. కూల్చివేస్తే తాము పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని బాధిత కుటుంబాల సభ్యులు భీష్మించారు. పోలీస్ బందోబస్తు లేని కారణంగా అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. త్వరలో పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని తెలిపారు. ఈ ఘటన అనంతరం బాలాపూర్ ఆర్.ఐ జమీల్ అక్కడికి చేరుకొని నిర్మాణాన్ని పరిశీలించారు.

పేద విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డులు అందజేస్తున్న చందు

ఇబ్రహీంపట్నం రూరల్: పేద విద్యార్థులకు దాతలు చేయూతనందించాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు దారు శరత్ రాయుడు(చందు) సూచించారు. బుధవారం మండల పరిధి పోల్కంపల్లి అనుబంధ గ్రామం ఎన్గల్‌గూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చందు టై, బెల్టులు, ఐడీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. ఉపాధ్యాయులు చిన్నారులకు నాణ్యమైన బోధన చేయాలని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్‌కె జహీర్‌ఖాన్ విద్యార్థులకు గ్రీన్ కార్పెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.కిరణ్‌కుమార్, నర్సింహ, అంగన్‌వాడీ టీచర్ శోభ, యాదగిరి, పీటీఎఫ్ నర్సింహ బాలమణి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్త



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న పోలీసులు

యాచారం: ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విలువైన సామగ్రిని భద్రంగా ఉంచుకోవాలని ప్రయాణికులకు పోలీసులు సూచించారు. సీఐ శంకర్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం పోలీసుల బృందం మండల కేంద్రంలో సైకిళ్లపై గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాప్‌లో ఉన్న ప్రయాణికులకు గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. శుభకార్యాలు, బంధువుల ఇళ్లకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన సామగ్రి, నగలు ఉంచరాదని తెలిపారు. గ్రామాల్లో రాత్రి, పగలు అపరిచిత వ్యక్తులు కనిపించినట్లయితే.. 100 కాల్ చేయాలని పేర్కొన్నారు. గస్తీలో ఏఎస్‌ఐ శ్రీనువాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బర్రెలక్కకు సన్మానం



శిరీషతో యువ నాయకులు

కడ్తాల్: యువ నాయకురాలు బర్రెలక్క(శిరీష)ను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం ఆమె హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో కడ్తాల్ మండల కేంద్రంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురు యువ నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. అనంతరం శిరీష మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. నిరుద్యోగుల తరఫున పోరాడేందుకు సిద్ధమని, తనకు మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్, నాయకులు జహంగీర్‌అలీ, సురేశ్, మణికిరణ్, మణికాంత్, గణేశ్, కార్తీక్, రాఖీ, శివ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సందడి

ఊరూరా జాతీయ జెండాలతో ర్యాలీలు



ఆమనగల్లు: గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాలతో విద్యార్థులు, నాయకులు



కడ్తాల్: ర్యాలీలో మాట్లాడుతున్న బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్

ఆమనగల్లు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేవైఎం నాయకులు బుధవారం విద్యార్థులతో కలిసి హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధులకు జై అంటూ నినదించారు. అనంతరం స్థానిక గాంధీచౌక్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంతో దేశ ప్రజల్లో ఐక్యత పెరుగుతుందని తెలిపారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, ఎస్‌ఐ వెంకటేశ్, బీజేపీ నాయకులు నర్సింహ, బీజేవైఎం కల్వకుర్తి ఇన్‌చార్జి పద్మ అనిల్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవిరాథోడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, కౌన్సిలర్ సుందారి శేఖర్, నాయకులు బుచ్చయ్య, శ్రీశైలంయాదవ్, సందీప్, శ్రీనివాస్, ప్రశాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ముస్తాబు

మాడ్గుల: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు మాడ్గుల మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యలయాలు ముస్తాబవుతున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులు రంగురంగుల కాగితాలను అతికించారు. ఆవరణలో భారతదేశ చిత్రపటాన్ని గీసి, రంగలను అద్దారు.



నేలపై దేశ చిత్ర పటాన్ని గీసి, రంగులు అద్దుతున్న ఇర్విన్ విద్యార్థినులు

ఇంటింటిపై జెండా ఎగరాలి

కడ్తాల్: ప్రధాని పిలుపు మేరకు బీజేపీ శ్రేణులు మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎస్టీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్ మాట్లాడారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. ఇందులో ఎస్టీమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భాస్కర్ నాయక్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు భగీరథ్, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, మహేశ్, శేఖర్, శ్రీశైలంగౌడ్, ప్రేమ్ కుమార్ నాయక్, శ్రీకాంత్ నాయక్, పంతునాయక్, గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



పట్టణంలో సంచరిస్తున్న కుక్కలు

భయపెడుతున్న గ్రామ సింహాలు

- నియంత్రణకు చర్యలు తీసుకోండి
- కమిషనర్ వసంతకు హిందూదళం సభ్యుల వినతి

ఆమనగల్లు: 'ప్రతి వీధిలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఎప్పుడు ఎటునుంచి ఎవరిపై దాడికి పాల్పడతాయో.. ఏ హానీ తలపెడతాయో భయంగా ఉంది. వాటి బారి నుంచి ప్రజలను కాపాడండి' అని మునిసిపల్ కమిషనర్ వసంతకు హిందూదళం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆమనగల్లు పట్టణంలో శునకాల బెడద ఎక్కువయిందని తెలిపారు. రోడ్డుపై వెళ్లేవారిని వెంబడిస్తూ ఎగబడుతున్నాయని చెప్పారు. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయాందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అయినా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో దళం సభ్యులు టిల్లు యాదవ్, పాతకోట శ్రీశైలం, కుమార్‌గౌడ్, నరేశ్ తదితరులు ఉన్నారు.



కమిషనర్ వసంతకు వినతిపత్రం అందజేస్తున్న హిందూదళం సభ్యులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



డంపింగ్ యార్డు వద్ద చెత్త తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

- మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్
- ఫోన్ ఇన్ ఫిర్యాదులపై దృష్టి

శంకర్‌పల్లి: దశల వారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో కమిషనర్‌కు ప్రాంత ప్రజలు పలు సమస్యలను విన్నవించిన విషయం విధితమే. అనంతరం సమస్యల పరిష్కారానికి ఆయన దృష్టి సారించారు. ఇందులో భాగంగా బుధవారం మున్సిపాలిటీలోని 1,9వ వార్డుల్లో వీధికుక్కలను బ్లూ క్రాస్ వారికి పట్టించారు. అనంతరం డంపింగ్ యార్డు వద్ద చెత్తను రోడ్డుపై వేయడంతో ఇబ్బందులు తలెత్తినట్లు ఫిర్యాదు రాగా.. జేసీబీ సాయంతో చెత్తను డంపింగ్ యార్డు లోపలికి తరలించారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి ఆనంద్, సిబ్బంది అమర్‌నాథ్, హరిదాసు తదితరులు ఉన్నారు.

చినుకు పడితే.. చిమ్మచీకట్లో చుక్కాపూర్

మరో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయండి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

తలకొండపల్లి: వర్షాలు పడితే.. చుక్కాపూర్ గ్రామంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని, నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా ప్రత్యేకంగా మరో విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రైతులతో కలిసి బుధవారం చుక్కాపూర్ విద్యుత్ ఉప కేంద్రంలో ఏఈకి వినతి పత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. వేలాడుతున్న తీగలను సరిచేయాలన్నారు. చెన్నారం గ్రామం మధ్యలో ఉన్న త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని పేర్కొన్నారు. చెన్నారం నుంచి బోడియా తండా వరకు విద్యుత్ స్తంభాలను అమర్చి మరోలైన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇనుప పోల్స్‌ను తొలగించి, వాటి స్థానంలో సిమెంట్‌వి ఏర్పాటు చేయాలని, ఉప కేంద్రంలో రాత్రి వేళల్లో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జెఎల్‌ఎం శివ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రమేష్ నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య, జీర్యానాయక్, లింగయ్య, పర్వతాలు, రామచంద్రయ్య, నర్సింహ, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను ఖండించాలి

హిందూ పరిరక్షణ సమితి పిలుపు

తుర్కయంజాల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించాలని హిందూ పరిరక్షణ సమితి కోరింది. దాడులను నిరసిస్తూ.. బుధవారం సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్యాణ్ నాయక్, నాయకులు బచ్చిగళ్ల రమేష్, కరుణాకర్, నర్సింహ గౌడ్, నోముల కార్తీక్ గౌడ్, కొంతం యాదిరెడ్డి, నిరంజన్ రెడ్డి, మైలారం బాబు, ధన్‌రాజ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో 'సైబర్‌క్రైం'పై పోటీ పరీక్ష

విజేతలకు నేడు బహుమతుల ప్రదానం: ఎస్‌ఐ

కడ్తాల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఎస్‌ఐ వరప్రసాద్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సైబర్‌క్రైం అవేర్‌నెస్‌పై పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. సైబర్ నేరాలు, నైతిక విలువలు, కుటుంబ బాధ్యత, క్రమశిక్షణ తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ప్రతిభ చూపిన చిన్నారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గురువారం స్వాతంత్య్ర దినోత్సవాన రాణాలో సీఐ శివప్రసాద్ అందజేస్తారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, తల్లిదండ్రులకు పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. సెల్‌ఫోన్‌ను పరిమితికి మించి వాడటం మంచిది కాదని, దానిని వాడేటప్పుడు ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను వినియోగించుకోండి



విద్యార్థులతో ఏసీపీ అంజయ్య, బ్యాంకు అధికారులు తదితరులు

కడ్తాల్: కెనరా బ్యాంకు అందజేస్తున్న డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ (సైబర్ సెక్యూరిటీ) అంజయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రం ఎంబీపీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతిభావంతులైన 66 మంది ఎస్సీ,ఎస్టీ బాలికలకు రూ.2.64 లక్షల స్కాలర్ షిప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. విద్యార్థులకు ప్రోత్సాహకం అందజేయడం అభినందనీయమని కొనియాడారు. బ్యాంకుడీజీఎం సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 11 సంవత్సరాల వ్యవధిలో బ్యాంకు తరఫున 95,245 బాలికలకు రూ.46 కోట్ల స్కాలర్ షిప్‌లను అందజేశామని, స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 44,742 మందికి రూ.18 కోట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఆఫీస్ డీఎం రాజేశ్వరి, కెనరా బ్యాంక్ కడ్తాల్ శాఖ చీఫ్ మెనేజర్ విజయ్‌కుమార్, ఇతర బ్రాంచుల మెనేజర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే కసిరెడ్డికి గ్రామస్తుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తలకొండపల్లి: ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామ సమస్యలు తీర్చాలని మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం చుక్కాపూర్ గ్రామస్తులతో హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీలు నిర్మించాలన్నారు. శిథిలావస్థ ప్రాథమిక, ఉన్నత పాఠశాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పశువులు, జీవాలు అనారోగ్యం బారిన పడుతున్నాయని, పశు వైద్యుడిని నియమించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎండీ తాహేర్, చంద్రకుమార్, సంతోష్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాసురెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఇబ్రహీంపట్నం: కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఇందు విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వెంకట్‌రావు అన్నారు. మంగల్‌పల్లి సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచానికి తగినట్లుగా కమ్యునికేషన్ స్కిల్స్‌ను పెంచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ యువ శాస్త్రవేత్త నాగేంద్రబాబు, కళాశాల సెక్రటరీ అనూప్ చక్రవర్తి, డిన్ డా.రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ యాదగిరిరావు, హెచ్‌ఓడీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సేవలు విస్తృతం చేస్తాం

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ఆమనగల్లు: మారుమూల ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని లయన్స్‌క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. లయన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణంలోని భవానీ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్ సభ్యుల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ ఏడాది అధికంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి సౌకర్యానికి చర్యలు తీసుకోవడంతో పాటు.. వారికి ప్రోత్సాహకాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు నరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ డా.దామోదర్‌రెడ్డి, లయన్స్ కార్యదర్శి దోనాదుల మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ, పీఆర్‌ఓ పాష, సభ్యులు రమేశ్, రామచంద్రారెడ్డి, ఓంకారం, విష్ణువాస్‌రెడ్డి, చంద్రశేఖర్, నటరాజ్ యాదయ్య, రాంరెడ్డి, డా.కృష్ణ, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, కొండల్‌రెడ్డి, సత్యం, శ్రీను, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

తలకొండపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం అని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి గట్టుఇప్పలపల్లికి చెందిన కోల లక్ష్మీదేవి ఇటీవల అనారోగ్యానికి గురైంది. ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సహకారాలతో రూ.25,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కాగా.. చెక్కును చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో రాజు, జంగయ్య, మల్లేశ్, రవీందర్, ఆంజనేయులు, గోపాల్, సైదులు, సింహం తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల నిమిత్తం

తర్కలపల్లికి చెందిన మూగ బాలికకు వైద్య ఖర్చుల నిమిత్తం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో శ్రీశైలంగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, బుచ్చిబాబు ఉన్నారు.

నేడు 'రాధాకృష్ణ' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: తన కుమారుడు రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని గురువారం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. కొడుకు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చామని, ఆడబిడ్డల వివాహంతో పాటు ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందజేస్తున్నామని, పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలో నేడు మండల వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు విస్తరణకు రూ.9.50 కోట్లు కేటాయింపు

ఇబ్రహీంపట్నం రూరల్: రాందాస్‌పల్లి రహదారి విస్తరణకు రూ.9.50 కోట్లు కేటాయించడం హర్షణీయమని మాజీ సర్పంచ్ ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నిధుల విడుదలతో సాగర్ రహదారిని కలిపేందుకు బ్రహ్మణపల్లి వయా చింతపల్లిగూడ, రాందాస్‌పల్లి వరకు 6.60 కి.మీ. మేర రోడ్డు వెడల్పు కాబోతుందన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ప్రజల తరుపున ఎమ్మెల్యే రంగారెడ్డి, రోడ్డు కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు షూ పంపిణీ

యాచారం: మండల పరిధి కొత్తపల్లి గ్రామం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న సుమారు 200 మంది విద్యార్థులకు బుధవారం పి.రవి కుమార్తె మౌనికరెడ్డి షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సర్కారు బడుల్లో నిరుపేదల పిల్లలే ఉంటారని, వారికి నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులను ఆమె కోరారు. వారికి అండగా ఉంటానని చెప్పారు.



చిన్నారులతో దాత మౌనికరెడ్డి